# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ప్రపంచ ఉగ్రవాదానికి పాకిస్తాన్ కేంద్రంగా మారిందని భారత్ పునరుద్ఘాటించింది.**

**2.** **భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న సామాజిక మాధ్యమాలను నిలుపుదల చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రిత్వశాఖ రాష్ట్రాలను ఆదేశించింది.**

**3.** **వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రేషన్ కార్డులను అందించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**

**4.** **ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ సైన్యం చేపట్టే చర్యలకు తమ మద్దతు ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

**5.** **పునర్విభజన చట్టంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని స్థానంలో అమరావతి పేరు చేర్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

==========================

ప్రపంచ ఉగ్రవాదానికి పాకిస్తాన్ కేంద్రంగామారిందని భారత్ పునరుద్ఘాటించింది. ఢిల్లీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి మాట్లాడుతూ, పహల్గామ్ ఉగ్ర దాడిపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో చర్చలు జరుగుతున్నప్పుడు, ది రెసిస్టెన్స్ ఫ్రంట్ –ు=ఖీ పాత్రను పాకిస్తాన్ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. ఐక్యరాజ్యసమితి జాబితాలో ఉన్న లష్కే ఇ తోయిబా, జైష్ ఇ మహ్మద్ వంటి ఉగ్రవాద గ్రూపులకు పాకిస్తాన్ నిలయమని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

-----------------------

భారత్‌కు వ్యతి రేకంగా సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారం చేస్తున్న ఖాతాలను నిలుపుదల చేయాలని కేంద్ర హోం మంత్రిత్వశాఖ రాష్ట్రాలను ఆదేశించింది. ఆపరేషన్ సిందూర్ అనంతరం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో హోంమంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకు పలు సూచనలు చేసింది. ఆపరేషన్ సిందూర్ గురించి, దేశ భద్రత గురించి తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే ఖాతాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

మరోవైపు పాకిస్థాన్‌లో రూపొందిన మీడియా కంటెంట్ ప్రసారంపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది.

ఓటీటీ, ఇతర మీడియా వేదికల్లో రూపొందించిన వెబ్‌సిరీస్‌లు, సినిమా పాటలు, పోడ్‌కాస్ట్‌లను నిషేధించింది. జాతీయ భద్రత దృష్ట్యా నిషేధం తక్షణం అమల్లోకి వస్తుందని పేర్కొంది.

--------------------------

ఆపరేషన్ సిందూర్'లో కనీసం 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. ఢిల్లీలో నిన్న జరిగిన నేషనల్ క్వాలిటీ కాన్‌క్లేవ్‌లో రక్షణ మంత్రి పాల్గొని ప్రసంగించారు. దేశ సాయుధ దళాలు ప్రదర్శించిన పరాక్రమానికి కేంద్రమంత్రి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేస్తూ...

.వాయిస్.... 36 సెకన్లు

--------------------------

మరోవైపు జమ్మూకాశ్మీర్ లోని పఠాన్‌కోట్, రాజౌరిలో ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు వస్తున్న సమాచారం పూర్తిగా అవాస్తవమని రక్షణ వర్గాలు తెలిపాయి.సరిహద్దు ఉద్రిక్తతల పై కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ పలు దేశాల నాయకులతో చర్చించారు. ఇందులో భాగంగా గత సాయంత్రం అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో సంభాషించి సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ పోరాడుతోందని చెప్పారు. అలాగే ఉగ్రవాదాన్నిఎదుర్కోవడానికి భారత్ స్పందిస్తున్న తీరుపై ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటోనియో టజానితో కూడా చర్చించారు ఐరోపా సమాఖ్య –ఈయూ భద్రతా ప్రతినిధి కాజా కల్లాస్‌తో కూడా జరుగుతున్న పరిణామాలను జైశంకర్ చర్చించారు.

--------------------------

వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఈ నెల 15 నుంచి రేషన్ కార్డులను అందించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పౌరసరఫరాల శాఖపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. రేషన్ సరకుల పంపిణీ, దీపం-2 పథకం కింద ఉచిత సిలిండర్, ధాన్యం సేకరణలో లోటుపాట్లకు అవకాశం లేకుండా చూడాలని చెప్పారు. ఈ నెల 7న రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ప్రారంభించామని, దీనికి విశేష స్పందన లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

--------------------------

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా హైదరాబాద్‌లో గత సాయంత్రం ఆపరేషన్ సిందూర్ నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ఈ ర్యాలీ రాష్ట్ర సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు కొనసాగింది. ముఖ్యమంత్రి పిలుపు మేరకు ఈ ర్యాలీలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు మాజీ సైనికాధికారులు, భారీ సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్...30 సెకన్లు

--------------------------

పునర్విభజన చట్టంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని స్థానంలో అమరావతి పేరు చేర్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ వివరాలను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వెల్లడించారు. రాజధాని పరిధిలో వివిధ సంస్థలకు, భూకేటాయింపులకు, మున్సిపల్ శాఖ 281 పనులను హైబ్రిడ్ యాన్యూటీ విధానంలో చేపట్టేందుకు ఆమోదం తెలిపిందని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్.... 28 సెకన్లు

కాగా అంతకుముందు అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన త్రివిధ దళాలకు మంత్రివర్గం ధన్యవాదాలు తెలిపింది.

---------------------------

భారత ప్రభుత్వానికి మద్దతుగా 'వందేమాతరం' నినాదాన్ని సామాజిక మాధ్యమ ఖాతాల డిస్ ప్లే పిక్చర్ – డీపీగా పెట్టుకోవాలని ప్రజల్ని ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. దేశ సమగ్రతను దెబ్బతీయడానికి శత్రుదేశం ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో అందరూ కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంకేతంగా డీపీ పెట్టుకోవాలని, 'వందేమాతరం' అని నినదించాలని కోరారు.

---------------------------

తెలంగాణలో వైద్య రంగ సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లాలో 35 ఎకరాల్లో 166 కోట్ల రూపాయలతో నిర్మించనున్న వైద్య కళాశాల భవనాల నిర్మాణాలకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తో కలిసి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తూ వైద్య కళాశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా అన్నవరం సత్యనారాయణ స్వామివారి కల్యాణ మహోత్సవం గత రాత్రి వైభవంగా జరిగింది. కల్యాణత్సవంలో ముందుగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్లకు వెండి గరుడ, గజ వాహనాలపై గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 9.30 గంటలకు కల్యాణతంతు ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలోని రామాలయం పక్కన ఉన్న వేదికపై స్వామి, అమ్మవార్లను.. ఆశీనులను చేసి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు శాసనసభ్యులు వరుపుల సత్యప్రభ, ఆలయ ఛైర్మన్ రోహిత్, స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు.

=====================